నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 10 నవంబర్ 2024 | HYDERABAD

తాగునీటి సరఫరాలో అంతరాయం

సిటీబ్యూరో, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేస్ -2లో కల్ బ్‌గూర్ నుంచి పటాన్‌చెరు వరకు ఉన్న 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో మరమ్మతుల కోసం సోమవారం ఉదయం 6 నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని



జలమండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్సీ పురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్, ఓఅండ్‌ఎం డివిజన్ 24లోని బీరంగూడ, అమీన్‌పూర్, ట్రాన్స్‌మిషన్ డివిజన్ 2లోని ఆఫ్ టేక్ పాయింట్స్, బల్క్ కనెక్షన్లు, ఓ అండ్ ఎం డివిజన్ 6లోని ఎర్రగుడ్డ, ఎస్ ఆర్ నగర్, అమీర్‌పేట తదితరుల చోట్ల తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అల్వాల్‌లో గ్రిల్ హౌస్ సీజ్

మల్కాజిగిరి: అల్వాల్ సర్కిల్ లోతుకుంట లోని 'గ్రిల్ హౌస్' హోటల్‌ను శనివారం అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం లోతుకుంట లోని గ్రిల్ హౌస్‌లో షవర్మ తిన్న ఆరుగురు అస్వస్థతకు గురైనట్లు స్థానికులు ఫిర్యాదు చేసినట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ తెలిపారు. వెంటనే హోటల్‌లో నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపించినట్లు చెప్పారు. గతంలో గ్రిల్ హౌస్‌లో షవర్మ తిని చాలా మంది అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం హోటల్‌ను సీజ్ చేశామని వెల్లడించారు. ల్యాబ్ నుంచి ఫలితాలు వచ్చిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వివరాలు ఎందుకివ్వాలి?

ప్రజా పాలన దరఖాస్తులు ఏమయ్యాయి

సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లకు జనం ప్రశ్నల వర్షం

ఎలాంటి వివరాలు ఇవ్వమంటూ ముఖంపైనే చెప్పేస్తున్న వైనం

సిటీబ్యూరో/బంజారాహిల్స్/ముషీరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : సమగ్ర కుటుంబ సర్వే సమరాన్ని తలపిస్తున్నది. వివరాలు ఇవ్వండి అంటూ వెళ్లిన అధికారులకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. సర్వే క్వశ్చనెయిర్ చదువుతుంటేనే జనం చికాకు పడుతున్నారు. 'ఏందీ దౌర్భాగ్యం మాకు. వేరే పనేలేనట్టు. వివరాలు ఎందుకివ్వాలి. ఇంతకు ముందు మాకేం కావాలో ప్రజాపాలన దరఖాస్తులు అందించాం కదా. అవన్నీ వట్టివేనా? మళ్లీ గిప్పుడు సమగ్ర కుటుంబ సర్వే అంటూ వచ్చారు. మేం వివరాలు ఇవ్వం. మీరేం చేసుకుంటారో చేసుకోండి. స్టిక్కర్లు కూడా మా ఇంటికి అతికించొద్దు..' అంటూ అధికారులపై జనం మండిపడుతున్నారు. దీంతో సర్వేకు వెళ్తున్న అధికారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. జనం అంతా ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారని.. వివరాలు అడిగితే సహకరించడం లేదని ఓ సర్వే బృందం పేర్కొంది. నగరంలో ఎన్యుమరేటర్లకు ఎదురవుతున్న చేదు అనుభవాలతో సమగ్ర కుటుంబ సర్వే ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌పై జనంలో వ్యతిరేకత వెల్లువెత్తుతుండటానికి ఈ సమగ్ర సర్వేనే ఉదాహరణ అని నిపుణులు చెబుతున్నారు. మొన్నటి వరకు హైడ్రాతో పేదోళ్ల ఇండ్లు కూల్చి.. నిన్న మూసీ నిరుపేదల ఇండ్లను నేలమట్టం చేసిన సంఘటనలతో జనం ఆగ్రహంతో ఉన్న సమయంలో ఇప్పుడు సమగ్ర కుటుంబ సర్వే పేరుతో వివరాలు ఇవ్వాలంటూ వస్తున్న అధికారులపై నగరవాసులు మండిపడుతున్నారు.

'ప్రజాపాలన' ఏమైంది..?

సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను అంటించేందుకు బస్తీలకు వెళ్తున్న సర్వే సిబ్బందికి స్థానికులు చుక్కలు చూపిస్తున్నారు. 'ప్రజాపాలన అంటూ ఆరునెలల కిందట దరఖాస్తులు తీసుకున్నారు.. వాటిని ఏం చేశారం'టూ కొంతమంది ప్రశ్నిస్తుండగా, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేస్తే ఇప్పటిదాకా గతి లేదు కానీ మళ్లీ సర్వే అని ఎందుకు వచ్చారంటూ విసుగును ప్రదర్శిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగుల పింఛన్ల గురించి నిలదీయడంతో పాటు బూతులు తిడుతున్నారని, మహిళలు రూ.2500 ఎందుకు ఇవ్వడం లేదని కోపంతో చూస్తున్నారని స్టిక్కర్లు వేసేందుకు వెళ్లిన సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే చేస్తున్న వారిలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, టీచర్లు, యూసీడీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్స్, మహిళా పొదుపు సంఘాల సభ్యులు పాల్గొంటున్నారు. తమను స్థానికంగా అందరూ గుర్తుపడతారని, గతంలో ఇచ్చిన దరఖాస్తుల గురించి నిలదీస్తుంటే ఇబ్బందికరంగా ఉందని సర్వే సభ్యులు పేర్కొన్నారు. కేవలం స్టిక్కర్లు వేసేందుకు వెళ్తేనే ప్రజలు ఈ స్థాయిలో నిలదీస్తుంటే, క్షేత్రస్థాయిలో 75 ప్రశ్నలు వేసేందుకు వెళ్లినప్పుడు ఏ విధంగా స్పందిస్తారో అనేది తలచుకుంటేనే భయంగా ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో..

గ్రేటర్ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను షెడ్యూలు ప్రకారం కచ్చితత్వంతో చేపట్టేందుకు సమన్వయ, పర్యవేక్షణ అధికారులను రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిశోర్ నియమించారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రత్యేకంగా మెమో జారీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో నిర్వహించే సామాజిక,ఆర్థిక,విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమన్వయ అధికారిగా హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ పరిధిలోని సికింద్రాబాద్, చార్మినార్ జోన్లకు హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ శ్రీవత్స కోట, ఎల్బీనగర్, ఖైరతాబాద్ జోన్లకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి ప్రియాంక, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్‌లకు జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్‌లను పర్యవేక్షణ అధికారులుగా నియమించారు.

స్టిక్కర్లు ఎలా అంటిస్తారంటూ..

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్ డివిజన్లలో మూడురోజుల కిందట ప్రారంభమైన సర్వే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ స్టిక్కర్లు అంటించే కార్యక్రమం కొనసాగుతున్నది. అయితే సర్వేలో పాల్గొంటున్న ఎన్యుమరేటర్లకు ఆయా ఇండ్ల యజమానులు సహకరించకపోవడంతో పాటు కిరాయికి ఉన్నవారి ఇండ్లకు స్టిక్కర్లు ఎలా అంటిస్తారంటూ గొడవలకు దిగుతున్నారు. కుల గణన సర్వే అంటూ ఆదాయ వివరాలు, ఆస్తుల వివరాలు, ఆధార్ కార్డుల వివరాలను ఎలా సేకరిస్తారని కొంత మంది తీవ్రస్థాయిలో నిలదీస్తున్నారు. కాగా, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు చెందిన నివాసితులు మరింత తీవ్రంగా ప్రతి స్పందిస్తున్నారు. సర్వే సిబ్బందిని దూషించడంతో పాటు తమ ఇంటిముందు నుంచి వెళ్లకపోతే కుక్కలను వదులుతామని బెదిరిస్తుండడంతో వారంతా తీవ్ర ఆందోళనలో ఉన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం. 3లోని అరోరా కాలనీలో సర్వే కోసం వెళ్లిన టీచర్లపై ఇంటి యజమానులు కుక్కలు ఉసిగొల్పుతామంటూ బెదిరించడం తీవ్ర కలకలం రేపింది. ప్రజల్లో సరైన అవగాహన కల్పించకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఎదురవుతున్నదని సర్వే సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వేకు ఆటంకం..

ముషీరాబాద్ నియోజవర్గం గాంధీనగర్ డివిజన్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను స్థానికులు అడ్డుకున్నారు. గాంధీనగర్‌లో సర్వే చేయడానికి వచ్చి ఎన్యుమరేటర్లతో వాగ్వాదానికి దిగారు. ఎన్యుమరేటర్లు ప్రశ్నావళిని అడుగుతుండగా, ఎందుకు సమాధానం చెప్పాలంటూ ప్రశ్నించారు. ఏంపథకాలు ఇచ్చారని సర్వే చేస్తుండ్రు, ఇచ్చిన హామీ ఏమయ్యాయంటూ నిలదీశారు. అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేయగా వారు ససేమిరా అన్నారు. దీంతో చేసేది లేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాంనగర్‌లోనూ కాలనీ వాసులందరూ సర్వేకు సహకరించలేదు. అధికారులు వెనక్కి వెళ్లిపోయారు. ఇలా నగరంలో ఎన్యుమరేటర్లకు ఇలాంటి అనుభవాలే ఎదురవుతుండటంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాళ్లు కూడా చేసేదేమీ లేకపోవడంతో ఎలాగోలా మీరే సర్వే ముగించాలంటూ ఎన్యుమరేటర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. మొత్తంగా సమగ్ర కుటుంబ సర్వే ఆదిలోనే జనం ఆగ్రహం చవి చూస్తుండటంతో ఏం చేయాలో తెలియక అధికారులు అయోమయం చెందుతున్నారు.



సిలికాన్ సిటీ విధానం గ్రేటర్‌లో పనిచేస్తుందా..!

హైడ్రా అధికారుల్లో అంతర్గత చర్చ

బెంగళూరు ఆదర్శమా?

బెంగళూరు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విషయంలో అక్కడి టెక్నోక్రాట్స్ ఎప్పుడో పెదవి విరిచారు. సిలికాన్ సిటీలో విపత్తుల నిర్వహణ పూర్తిగా ఫెయిల్యూర్ అంటూ పలు సంస్థలు నివేదికలిచ్చాయి. చెన్నై, బెంగళూరు సిటీలను కేస్ స్టడీలుగా తీసుకుని రీసెర్చ్ స్కాలర్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌వైఫల్యాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి తమ రిపోర్టులు తయారు చేశారు. గత నెలలో బెంగళూరులో కురిసిన వర్షాలకు నగరంలో దాదాపు చాలా ప్రాంతాలు నీటమునిగాయి. రెండురోజుల పాటు సిటీ మొత్తం అతలాకుతలమైంది. అక్కడి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పూర్తిగా ఫెయిలయిందంటూ చాలా మంది విమర్శించారు.

సిటీబ్యూరో: బెంగళూరు సిటీలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై అధ్యయనం చేయడానికి రెండురోజుల పాటు హైడ్రా బృందం బెంగళూరులో పర్యటించింది. హైదరాబాద్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు చెరువుల పునరుద్ధరణను సంబంధించి బెంగళూరు తరహాలో చేయడానికి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసింది. రెండురోజుల్లో మొదటిరోజు డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు బెంగళూరులో పునరుద్ధరించిన చెరువుల సందర్శన తర్వాత రెండో రోజు లేక్‌మ్యాన్ ఆనంద్‌మల్లిగవాడ్ డెవలప్ చేసిన చెరువులను సందర్శించారు. ప్రధానంగా ఈ పర్యటనలో చెరువుల పునరుద్ధరణలో బెంగళూరులో అవలంబించిన సహజ విధానాలపై హైడ్రా అధికారులు తెలుసుకున్నారు. వాటిని హైదరాబాద్‌లో చెరువుల పునరుజ్జీవానికి అప్లై చేయొచ్చా లేదా అనేది ప్రస్తుతం హైడ్రా బృందంలో చర్చ జరుగుతున్నది.

అడ్వాన్స్ టెక్నాలజీలో ముందున్నా..

కర్ణాటక స్టేట్ నేచురల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సెంటర్‌ను హైడ్రా అధికారులు సందర్శించారు. ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు ఎలాంటి చర్యలు చేపడతారో తెలుసుకున్నారు. వరద ముంచెత్తే ప్రాంతాల వారీగా అలర్ట్ చేయడం, ట్రాఫిక్ జామ్ అలర్ట్, ప్రత్యామ్నాయ రహదారులను సూచించే విధానాలపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. మేఘ సందేశం యాప్ పనిచేసే విధానం , ఈ యాప్ ద్వారా ఏయే ప్రాంతాల్లో ఎంత మోస్తరు వర్షం కురుస్తుంది? ట్రాఫిక్ జామ్, వడగళ్లవానతో పాటు ఇతర వాతావరణ అంశాలతో అలర్ట్ చేసే ప్రక్రియను పరిశీలించారు. అయితే టెక్నాలజీ పరంగా బెంగళూరు ముందున్నా...అక్కడి పరిస్థితులు వేరు.. హైదరాబాద్ పరిస్థితి వేరు.. ఒక వర్షం పడితే బెంగళూరులో రహదారులే కాదు.. అపార్ట్‌మెంట్లే వరద నీటిలో మునిగిపోతుంటాయి. మెట్రో రైళ్లు ఉన్నా ట్రాఫిక్ సమస్యకు ఇప్పటికీ తీరలేదు. బెంగళూరు తరహాలోనే హైదరాబాద్‌లోనూ ట్రాఫిక్ సమస్య ఉంది. వర్షం పడితే గంటల తరబడి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ సమస్య తలెత్తడం.. కొన్ని ప్రాంతాల్లో ప్రయాణించాలంటేనే నగరవాసికి ప్రత్యక్ష నరకం కనిపిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. కానీ బెంగళూరు తరహాలో హైదరాబాద్‌లో తీవ్రత లేదని హైడ్రా అధికారులే చెబుతున్నారు. అసలు హైదరాబాద్‌లో బెంగళూరు సిస్టం పనిచేస్తుందా..? టెక్నాలజీ పరంగా అక్కడి సెన్సార్‌ల వ్యవస్థ బాగానే ఉన్నా.. డిజాస్టర్ పరంగా బెంగళూరు మేనేజ్‌మెంట్ సక్సెస్ కాలేదని అధికారులు అంటున్నారు. గ్రేటర్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో గతంలో పనిచేసిన అధికారులతో పాటు జీహెచ్ఎంసీ సిబ్బందితో క్షేత్రస్థాయిలో ఎలా ఉంటుందో చర్చించి ఒక నిర్ణయానికి రావాలని అనుకుంటున్నట్లు తెలిసింది. గతంలో కర్ణాటక ప్రభుత్వ పెద్దలు హైదరాబాద్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌ను చూసి వెళ్లారు. బెంగళూరు కంటే ఇక్కడే బాగుందంటూ కితాబు కూడా ఇచ్చారు. మరి ఇప్పుడు హైడ్రాకు బెంగళూరు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అంతగా నచ్చిందంటే కారణమేమిటోనన్న చర్చ జరుగుతోంది.

ఫిలింనగర్‌లోని శంకర్ విలాస్ చౌరస్తాలో కూల్చివేతలు చేస్తున్న హైడ్రా సిబ్బంది

పిలిచిన పనులకే మళ్లీ.. మళ్లీ టెండర్లు

రీకాల్ మోడ్‌లో హెచ్ఎండీఏ

సిటీబ్యూరో, నవంబర్ 9(నమస్తే తెలంగాణ) : పిలిచిన పనులకే టెండర్లను పిలుచుకుంటూ..హెచ్ఎండీఏ కాలయాపన చేస్తున్నదనే విమర్శలను మూటగట్టుకుంటున్నది. ఇలా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలోనూ అడ్వయిజరీ నియామకానికి కూడా రెండు సార్లు టెండర్లు పిలిచే పరిస్థితి వచ్చింది. కొత్తగా కొత్వాల్‌గూడ ఏకో పార్కులో అరుదైన పక్షుల కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఈ టెండర్లను రీకాల్ చేశారే తప్ప.. పనుల్లో ఒక్క అడుగు పడలేదు.

ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే..

అభివృద్ధి పనులు చేపట్టడంలో హెచ్ఎండీఏ పనితీరు డిఫరెంట్. కానీ అదంతా గతం. ఇప్పుడంతా టెండర్లు పిలవాలి.. కొర్రీలతో పనులను పక్కనపెట్టేయాలి.. వీలైతే మరోసారి టెండర్ రీకాల్ చేస్తే సరిపోతుందనే విధానమే నడుస్తోంది. ముఖ్యంగా గతంలో చేపట్టిన పనులను కూడా అతి కష్టం మీద గట్టెక్కిస్తున్నామనే తీరుగా పనులు చేపడుతున్నారు. ఇలా ఎప్పుడో పూర్తి కావాల్సిన ప్రాజెక్టులు కూడా ఆలస్యమవుతున్నాయి. దీంతో ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే పక్కన పడుతున్నాయి.

శ్రద్ధ పెట్టని అధికారులు

ప్రభుత్వం హైదరాబాద్‌ను విశ్వనగరంగా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని చెబుతున్నా... దానికి అనుగుణంగా ప్రణాళికలను అమలు చేయడంలో హెచ్ఎండీఏ అధికారులు శ్రద్ధ పెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కీలకమైన ప్రాజెక్టుల విషయంలో అధికారుల వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తున్నది. సీఎం రేవంత్ రెడ్డి గొప్పగా చెప్పుకునే ఎలివేటెడ్, మీరాలం కేబుల్ బ్రిడ్జి ప్రాజెక్టులకు కూడా ట్రాన్సాక్షనల్ అడ్వైజరీ పేరిట పిలిచిన టెండర్లను పాడిగించారు. కొత్వాల్‌గూడ ఏకో పార్కు విషయంలోనూ ఇప్పటివరకు మూడు సార్లు టెండర్లు పిలిచినా.. పనులు పూర్తి కాలేదు. అతిపెద్ద పక్షిశాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు గతంలో టెండర్లను ఆహ్వానించారు. కానీ ఏం జరిగిందో తెలియదు కానీ మరోసారి టెండర్లను పిలుస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు.

కోర్టు ఆదేశాలున్నా.. హైడ్రా కూల్చివేతలు

మహిళా మండలి భవనం నేలమట్టం

సిటీబ్యూరో/బంజారాహిల్స్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పార్కుల ఆక్రమణల విషయంలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా కూల్చివేతలు మొదలుపెట్టింది. ఫిల్మ్‌నగర్‌లో రోడ్డును ఆక్రమించారంటూ నిర్మాణాన్ని శనివారం హైడ్రా సిబ్బంది కూల్చేశారు. స్థానికుల ఫిర్యాదుతో మొదట ఫిల్మ్‌నగర్ లేఔట్‌ను పరిశీలించిన హైడ్రా అధికారులు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. ఫిలింనగర్ రోడ్ నం. 1లోని శంకర్ విలాస్ చౌరస్తాలో మహనీయుల విగ్రహాల వెనుక 290 గజాల స్థలంలో రేకుల షెడ్డుతో పాటు భవనం ఉంది. సొసైటీ లే అవుట్‌లో ఈ స్థలం జీహెచ్ఎంసీ రోడ్డు అని చూపిస్తోందని, సొసైటీ ప్రతినిధులు దీన్ని మహిళా మండలి పేరుతో ఆక్రమించుకున్నారని స్థానికులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు స్థానిక జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 2న హైడ్రా డిప్యూటీ సిటీ ప్లానర్ మహిళా మండలికి నోటీసులు జారీ చేశారు. దీనికి వారిచ్చిన సమాధానంతో సంతృప్తికరంగా లేదంటూ.. తిరిగి 6న మరో నోటీసు ఇచ్చి అందులో 24 గంటల్లోగా ఖాళీ చేయాల్సిందిగా నోటీసులు ఇచ్చారు. అయినప్పటికీ వారు ఖాళీ చేయకపోవడంతో శనివారం మధ్యాహ్నం జేసీబీలతో వచ్చిన హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది మహిళా మండలి భవనాన్ని కూల్చివేశారు. అదే స్థలానికి ఆనుకొని ఉన్న ఇల్లు ప్రహరీ కూడా ఆక్రమించి నిర్మించినట్లు నిర్ధారించి.. రేకుల షెడ్డుతో పాటు రోడ్డుపైకి వచ్చిన ఇంటి గోడను కూడా కూల్చేశామని హైడ్రా అధికారులు చెప్పారు. కూల్చివేతలు జరిగిన వెంటనే డెబ్రిస్‌ను అక్కడి నుంచి తొలగించారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడి తమ అధికారులు కూల్చేసిన స్థలంలో వెంటనే రోడ్డు నిర్మించాలని సూచించారు.

కోర్టు ఆదేశాలున్నా కూల్చేశారు : సొసైటీ ప్రతినిధులు

సుమారు 30ఏండ్ల కిందట ఫిలింనగర్ సొసైటీకి చెందిన ఖాళీ స్థలంలో నిర్మించిన మహిళా కల్చరల్ సెంటర్ భవనాన్ని కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది కూల్చివేశారని ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ ఆరోపించారు. ఈనెల 2న నోటీసులు ఇచ్చిన హైడ్రా అధికారులకు సొసైటీ తరపున జవాబు ఇచ్చామని చెప్పారు. 2023 నవంబర్‌లోనే సిటీ సివిల్ కోర్టులో తమకు పర్మినెంట్ ఇంజెంక్షన్ ఆదేశాలు ఉన్నాయని, ఈ స్థలంపై జీహెచ్ఎంసీకి హక్కు లేదని, సొసైటీకి చెందిన స్థలంలో సుమారు 30 ఏండ్ల కిందటే భవనం నిర్మించామని నేరుగా హైడ్రా కమిషనర్‌కు లేఖ రాశామని సూర్యనారాయణ చెప్పారు.

టీజీఎస్‌పీడీసీఎల్‌లోకి సాయంత్రం 4 తర్వాతే అనుమతి

గంటలోపే పని ముగించుకోవాలట

సిటీబ్యూరో: ఏదైనా పని ఉంటేనే ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వచ్చి వెళ్తుంటారు. అలాంటిది నిబంధనల పేరిట ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల్లోకి రాకుండా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు చర్యలు చేపట్టడంపై విద్యుత్ వినియోగదారులు మండిపడుతున్నారు. ప్రజలకు సేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన కార్యాలయాలను తమ సొంత సంస్థల్లాగా ఉన్నతాధికారులు భావిస్తూ నిబంధనలు అమలు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా టీజీఎస్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోకి ప్రవేశించడంపై అమలు చేస్తున్న నిబంధన పలు విమర్శలకు తావిస్తున్నది. సాయంత్రం 4 గంటలు దాటిన తర్వాత అధికారులను కేవలం 5 గంటల్లోపే కలవాలంటూ పెట్టిన ఆంక్షలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు సాయంత్రం 4 గంటలు కాగానే ఇంటికి వెళ్లే సమయంలో అనుమతిస్తే వారు తమ సమస్యలను సరిగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

15 జిల్లాలకు ప్రధాన కార్యాలయం..

దక్షిణ తెలంగాణలోని 15 జిల్లాలకు సంబంధించి విద్యుత్ సరఫరా వ్యవస్థలను పర్యవేక్షించేందుకు టీజీఎస్‌పీడీసీఎల్ కార్యాలయం ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో ఉంది. ఇక్కడికి గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి సైతం విద్యుత్ వినియోగదారులతో పాటు కాంట్రాక్టర్లు వివిధ పనుల కోసం వచ్చి వెళ్తుంటారు. సుమారు 150 నుంచి 200 కి.మీ దూరం నుంచి వచ్చిన వారికి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుమతి లేకపోతే అధికారులను కలిసేదెప్పుడు? వచ్చిన పని పూర్తయ్యేందుకు సమయం ఎక్కడిదంటూ విద్యుత్ వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

సర్కారు దవాఖానల్లో సగం మందుల్లేవ్

పలు ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత

సిటీబ్యూరో: గ్రేటర్‌లోని పలు ప్రభుత్వ దవాఖానల్లో మందులు లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. వైద్యులు రాసిన ప్రిస్క్రిప్షన్‌లో దాదాపు 30 నుంచి 40 శాతం మందులను బయట తీసుకోవాలంటూ ఆయా దవాఖానల్లోని ఫార్మసీ సిబ్బంది చెప్పడంతో రోగులు ఉసూరుమంటున్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది జలుబు, దగ్గు, జ్వరం, వంటి నొప్పులు తదితర లక్షణాలతో కూడిన వైరల్ ఫీవర్స్‌తో దవాఖానలకు క్యూ కడుతున్నారు. ఇలాంటి సమయంలో వారికి అవసరమైన చిన్నపాటి జలుబు, దగ్గు వంటి మందులు కూడా అందుబాటులో లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ సీహెచ్‌సీలో మందుల కొరత తీవ్రంగా ఉన్నట్లు రోగులు చెబుతున్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలో కనీసం జలుబుకు సంబంధించిన సీపీఎం మాత్రలు కూడా అందుబాటులో లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో రాజేంద్రనగర్ సీహెచ్‌సీకి పెద్ద సంఖ్యలో రోగులు తరలి వస్తున్నారు. ఈ క్రమంలోనే జలుబు, దగ్గు, జ్వరం తదితర లక్షణాలతో శనివారం ఓపీకి వచ్చిన రోగుల ఆరోగ్య పరిస్థితి ఆధారంగా వైద్యులు ప్రిస్క్రిప్షన్‌లో మందులు రాసిచ్చారు. ఈ ప్రిస్క్రిప్షన్ తీసుకొని ఫార్మసీ కౌంటర్‌కు వెళ్లిన రోగులకు అక్కడి సిబ్బంది నుంచి చుక్కెదురైంది. వైద్యులు రాసిన మందుల్లో జలుబుకు సంబంధించి సీపీఎం తదితర మందులు లేవని, వాటిని బయట కొనుగోలు చేసుకోమని చెప్పడం గమనార్హం.

మైనంపల్లి..

ఎప్పుడూ.. ఏదో ఒక లొల్లి

వరుస వివాదాలతో నెట్టింట్లో చర్చ

ఎమ్మెల్యే రోహిత్ దుందుడుకు చర్యలపై తీవ్ర విమర్శలు

సిటీబ్యూరో: మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ వ్యవహార తీరు చర్చనీయాంశంగా మారుతున్నది. అతి చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలిచి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ.. అంతకు మించిన దురుసు ప్రవర్తనతో తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన రాహుల్ గాంధీ పర్యటనలోనూ ఆయన తీరుపై సర్వత్రా విమర్శలొచ్చాయి. భద్రతా నిబంధనలను ఉల్లంఘించి.. ఏకంగా రాహుల్ గాంధీ కాన్వాయ్‌లోకి చొచ్చుకుపోయారు. వెంటనే తేరుకున్న భద్రత సిబ్బంది.. ఆయన కారును అడ్డుకున్నారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చకు దారితీసింది. తాజాగా అదే దుందుడుకు స్వభావంతో మరోసారి సోషల్ మీడియాలో చర్చకు కారణమయ్యారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులోనూ ఇదే తీరుగా వార్తల్లో నిలిచారు. లోడింగ్ వెహికిల్ సాయంతో నేరుగా ఎయిర్‌పోర్టులోకి చొచ్చుకొని పోయే ప్రయత్నం చేయగా.. అడ్డుకున్న టోల్ సిబ్బందిపై విరుచుకుపడినట్లు ఓ వీడియో ఎక్స్‌లో హల్‌చల్ చేస్తున్నది. ఈ వీడియోను వాహనదారులు ఎక్స్‌లో పోస్టు చేయగా, ఆయన దురుసు ప్రవర్తన మరోసారి చర్చకు కారణమైంది. అతి చిన్న వయస్సులో పదవీ భాగ్యం దక్కినా... దాన్ని నిలుపుకోలేకపోతున్నారంటూ.. నెటిజన్లు మండిపడుతున్నారు. ఆయన వ్యవహార తీరు ఎప్పుడూ వివాదాలకు దారి తీస్తున్నదని అభిప్రాయపడుతున్నారు.

ఎర్రకుంట చెరువును పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

'ఎర్రకుంట' ఆక్రమణలపై హైడ్రా నజర్

సైదాబాద్: సైదాబాద్ దోబీఘాట్‌లోని ఎర్రకుంట చెరువు ఆక్రమణలపై హైడ్రా దృష్టి సారించింది. శనివారం హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేశ్, డీఈ ప్రవీణ్, ఏఈ మహేందర్ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో ఎర్రకుంట చెరువును సందర్శించి ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఆక్రమణలను, హిందూ శ్మశాన వాటి